రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం

- ఏడాది గడచినా అసంపూర్తిగానే..
- ఇబ్బందుల్లో వాహనదారులు, రైతులు

నెక్కొండ : మండలంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు నుంచి బంజరుపల్లి వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 4 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది గడచినా అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చంద్రుగొండ నుంచి బంజరుపల్లి వరకు ప్రభుత్వం రూ.11 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు గతేడాది చేపట్టింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం పలు గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు రాకపోకలు సాగించడం పరిపాటి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మూడు నెలల క్రితం కాంట్రాక్టరు కంకర పోశారు. కాగా తారు వేయడాన్ని విస్మరించారు. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణం సాగించే చంద్రుగొండ, గొల్లపల్లి, గేటుపల్లి, బంజరుపల్లి, గిరిజన తండాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సదరు రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది.


కంకర పోసి వదిలేసిన రోడ్డు

పనులు ప్రారంభిస్తాం

చంద్రుగొండ నుంచి బంజరుపల్లి వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొన్ని అనివార్య కారణాల వల్ల నిలిచిపోయాయి. ఈ క్రమంలో త్వరలో సదరు రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించే దిశగా చొరవ తీసుకుంటున్నాం. వాహనదారులకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. సత్వరమే పనులు ప్రారంభించి అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కలిగిస్తాం.

- గోపి, ఏఈ, ఆర్ అండ్ బీ శాఖ

అన్ని వర్గాలకూ ఇబ్బందులు

చంద్రుగొండ నుంచి బంజరుపల్లి వరకు చేపట్టి నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఈ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగించే రైతులు, వ్యాపారస్తులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాల్సి వస్తుండడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని పలువురు వాపోయారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

టీజేఎఫ్ రజతోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వర్ధన్నపేట : తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) హైదరాబాద్‌లో ఈనెల 31న నిర్వహించనున్న రజతోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రజతోత్సవాలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీజేఎఫ్ నాయకులు కోరారు.

అన్నదానం



గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద వరంగల్ నగర శివారులోని గొర్రెకుంటకు చెందిన బొమ్మినేని విజయ మోహన్‌రెడ్డి దంపతులు శనివారం అన్నదానం చేశారు. ప్రతి శనివారం ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శనివారాల్లో విజయ మోహన్‌రెడ్డి దంపతులు అన్నదానం చేస్తున్నారు. తొలుత ఆలయంలో విజయ మోహన్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు.

శిక్షణతో నైపుణ్యం పెంపు

నర్సంపేట : వేసవి శిక్షణతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించడంతోపాటు సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచేలా శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ మాట్లాడుతూ భగవద్గీత నేర్చుకోవడం వల్ల విద్యార్థులు విలువలతో కూడిన వ్యక్తిత్వం పెంపొందించుకుంటారని చెప్పారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి వనజ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ భవాని, ఏట సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు



నర్సంపేట రూరల్ : బైక్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట శివారులోని ఇప్పల్‌తండా క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇప్పల్‌తండా శివారు కొండసముద్రంతండాకు చెందిన జాటోత్ అనూష శ్రీను దంపతుల కుమారుడు వినయ్‌కుమార్ తన నాయినమ్మతో కలిసి నర్సంపేటకు వెళ్లి తిరిగి ఆటోలో ఇప్పల్‌తండా క్రాస్‌కు వచ్చి రోడ్డు దాటుతుండగా మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపు ప్రయాణిస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కు గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేటకు చెందిన పిట్టల విజయ క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మెపా జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, తదితరులు నివాళులర్పించారు. అనంతరం విజయ కుమారుడైన సీనియర్ జర్నలిస్టు, మెపా డివిజన్ గౌరవ అధ్యక్షుడు కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, నాయకులు సింగారపు రామకృష్ణ, పెండ్యాల కృష్ణ, చిలకలపెల్లి మహేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

నెక్కొండ : విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని చంద్రుగొండలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. చంద్రుగొండ శివారు మూడు తండాకు చెందిన మూడు రవి తన దుక్కిటెద్దులను వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లగా ఓ దుక్కిటెద్దు కింద పడి ఉన్న విద్యుత్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తనకు సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని రైతు రవి వాపోయాడు.

నాయకుల ఒత్తిడితోనే మాజీ చైర్మన్ మృతి

- ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి

నర్సంపేట : అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి మృతి చెందాడని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సత్యనారాయణరెడ్డి మృతదేహానికి రామస్వామి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రామస్వామి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా సత్యనారాయణరెడ్డిని తొలగించి మానసికంగా వేధించారని తెలిపారు. అధికార పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చడం కోసం ఇష్టారీతిన రుణాలు మంజూరు చేయాలని ఒత్తిడి చేశారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు చెట్టుపల్లి మురళీధర్ రావు, సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తినాయక్, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి బాల్నె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రామస్వామి, నాయకులు

కాంగ్రెస్ నాయకుల నివాళి

సత్యనారాయణరెడ్డి మృతదేహానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, తదితరులు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామయ్య, నాయకులు

- ఎస్సీ, ఎస్టీ కమిటీ ఉపాధ్యక్షుడు రామయ్య

నర్సంపేట రూరల్ : ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, హక్కులు సాధించుకోగలమని ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య తెలిపారు. నర్సంపేట మండలంలోని బిట్స్ కళాశాలలో ఉపాధ్యాయ సంఘాలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 2 రద్దు చేయాలని, అడ్వకేసీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, జీఓ నంబర్ 5 అమలు చేయాలని, జీఓ నంబర్ 342 ప్రకారం అన్‌డ్యూటీపై పీజీ విద్యాభ్యాసానికి జారీ చేసిన మెమోను రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని, జీఓ నంబర్ 3 ప్రకారం ఏజెన్సీలోని అన్ని ఉద్యోగాలను గిరిజనులతో భర్తీ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, బాలయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొమ్మాలు, పోడియం సాంబయ్య, రవీందర్, రవి, నాగేందర్, సారంగపాణి, సరితబాయి, కవిత, శోభారాణి, లలిత, శ్రావణి, స్వప్న, లలితదేవి, కోమల, కుసుమతి, రమాదేవి, కోమల, సదాశివ, భిక్షం, లక్ష్పతి, మహేందర్, సమ్మయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులతో జాగ్రత్త



గీసుకొండ : వేసవిలో అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ మాస్ మీడియా అధికారి (డెమో) అనిల్‌కుమార్ కోరారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని కీర్తి నగర్, దేశాయిపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాచ్ అప్ ఇమ్యూనైజేషన్ సెషన్స్‌ను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. వేసవిలో చర్మ వ్యాధులు, విరేచనాలు, సన్ స్ట్రోక్ తదితర సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 30 ఏళ్లకుపైబడిన ప్రతిఒక్కరూ అసంక్రమిత వ్యాధుల నిర్ధారణపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్లతో కలిగే లాభాల గురించి ఇటుక బట్టీ కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో సీఓలు కోర్నెల్, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉత్తీర్ణత ఖాయం


ఖానాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీల్

నర్సంపేట రూరల్/ఖానాపురం : ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత ఖాయమని నర్సంపేట స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎంఈఓ కొర్ర సారయ్య, ఖానాపురం ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ తెలిపారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమాల్లో వారు పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదవాలని తెలిపారు. ఒత్తిడికి గురి కావొద్దని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

- సమితి ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

నల్లబెల్లి : మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రకటించిన ఎజెండా మేరకు శాంతి చర్చలు నిర్వహించి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేలా కృషి చేయాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం, మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు చీకటి ప్రకాశ్, కోకన్వీనర్లు పాండవుల రాంబాబు, నల్లబెల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్, మాటూరి హరీశ్, గాజు భిక్షపతి, కడియాల క్రాంతి, ముస్తఫా, భూస కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

దాడికి యత్నించారని ఫిర్యాదు



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని నెక్కొండ రోడ్డులోని సర్వే నంబర్ 601/1/1లో గుడిసెలు వేసుకున్న పేదలపై కాకతీయ నగర్‌కు చెందిన బైరబోయిన వెంకటయ్య, బాలయ్య, వినయ్, రాంప్రసాద్, బాలకిషన్‌తోపాటు మరి కొందరు శనివారం తెల్లవారుజామున దాడికి యత్నించారని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి మాట్లాడారు. బైరబోయిన వెంకటయ్య, తదితరులు గుడిసెవాసుల మీద దాడి చేయడానికి మరణాయుదాలతో వచ్చారని తెలిపారు. గుడిసెవాసులు కేకలు వేయడంతో బెదిరింపులకు దిగుతూ కారులో పారిపోయారని చెప్పారు. గుడిసెవాసులకు రక్షణ కల్పించి దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు ఫరీదా, వజ్జంతి విజయ, లక్ష్మి తదితరులున్నారు.

ఆర్థికసాయం



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన సార సాంబయ్యకు చెందిన ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధం కాగా బాధిత కుటుంబానికి మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మండల అధ్యక్షుడు యాట రవికుమార్ ఆధ్వర్యంలో రూ.23500 సాయం అందజేశారు. తొలుత సాంబయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో సారంగం, రమేశ్, వెంకన్న, శ్రీనివాస్, ముఖేశ్, సందీప్, మహేందర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ఆర్' ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన సంగెం కొమురయ్య, మచ్చ కొమురయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి రూ.3 వేల చొప్పున సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గారె నర్సయ్య, ఐత రాంచందర్, ముద్రబోయిన సుధాకర్, గుద్ల గురునాథం, జీవన్, రవి, వెంకటేశం, కిశోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..



దుగ్గొండి : మండలంలోని రేకంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యాట రవి శనివారం అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ నాయకులు శనివారం రూ.10 వేల నగదు సాయం అందజేశారు. తొలుత రవి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవి మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాదారపు కన్నయ్య, నాయకులు గట్టికొప్పుల నర్సింహస్వామి, ఆసాల అశోక్, ఐలయ్య, కానుగుల కోటి, పింగిలి రవీందర్, రంపీస చిరంజీవరావు, సోమిడి భిక్షపతి, చెలిక సత్యం, పొన్నం శివ, వేణు, శ్రవణ్, చెలిక తిరుపతి, ఒలిగె సురేశ్, మాదారపు రాజేశ్, మంద కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'నేటి సదస్సుకు తరలిరావాలి'


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయపర్తి : జనగామ జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రంలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఉద్యమకారుల సదస్సుకు తరలి రావాలని ఉద్యమకారుల సంఘం జనగామ జిల్లా కన్వీనర్ పొలాస సోమయ్య కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సదస్సు వాల్‌పోస్టర్లను సంఘం పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌గౌడ్, పాలకుర్తి మండల అధ్యక్షుడు సింగారపు దీపక్‌లతో కలిసి సోమయ్య శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమకారుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలానికి చెందిన ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గాడిపెల్లి యాకన్న, యూసుఫ్, ఐత దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనే ధ్యేయం



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంఈఓ


నర్సంపేట : మాట్లాడుతున్న ఎంఈఓ సరళ

- ఎంఈఓలు సారయ్య, సరళ

నర్సంపేట/నర్సంపేట రూరల్ : విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందించడమే ధ్యేయంగా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఏర్పాటు చేసినట్లు నర్సంపేట, చెన్నారావుపేట ఎంఈఓలు కొర్ర సారయ్య, బైరి సరళ తెలిపారు. సదరు మండలాల్లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వృత్యంతర శిక్షణ శనివారం ముగియగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. టీఎల్‌ఎంను తప్పని సరిగా ఉపయోగించి బోధించాలని, బోధనలో మెళకువలు పాటించలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులందరూ చొరవ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్లు సునీత, రవి, సుభాష్, కొమురయ్య, వెంకన్న, రవి, సత్యనారాయణ, విజేందర్‌రావు, హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, కట్టస్వామి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం

- మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రకాశ్‌రావు, నాయకులు

ఖానాపురం : ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వెలిబుచ్చారు. మండలంలోని మనుబోతులగడ్డ, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శనివారం వారు సందర్శించి వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నా ప్రభుత్వం, అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు తరలించడంలో అధికారులు సైతం విఫలమయ్యారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లు తేమ పేరుతో దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లెపు సోమయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్, నాయకులు వల్లెపు శ్రీనివాస్, తేజావత్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి


సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న స్వప్న, తదితరులు

- కేస్ వర్కర్ స్వప్న

వర్ధన్నపేట : సఖి-వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని కేస్ వర్కర్ స్వప్న కోరారు. మండలంలోని ఇల్లందలో ఉపాధి హామీ పనులు చేస్తున్న శనివారం నిర్వహించిన సదస్సులో శ్రీదేవి, హరిత మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల రక్షణకు అమలవుతున్న చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి సెంటర్‌లో లభించే సేవలను వివరించారు. బాధిత మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు. బాధితులకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందిస్తున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు రక్షణ, సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పావని, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

కులాలను చేర్చడంపై పునరాలోచించాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉమ్మడి ఏపీలోని 26 బీసీ కులాలను తెలంగాణ బీసీ కులాల జాబితా నుంచి తొలగించిన క్రమంలో వాటిని మళ్లీ బీసీ జాబితాలో చేర్చాలన్న బీసీ కమిషన్ నిర్ణయంపై పునరాలోచించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని సంఘం నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కాలానుగుణంగా ఆమోదించిన వెనుకబడిన తరగతుల జాబితాలో 138 కులాలు, సామాజిక వర్గాలు ఉన్నాయని చెప్పారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద లభించిన అధికారాలను వినియోగించుకుని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రం కోసం 112 కులాలు, సామాజిక వర్గాల జాబితాను వెనుకబడిన తరగతులుగా స్వీకరించిందని, ఉమ్మడి ఏపీలోని 26 కులాలను తొలగించిందని తెలిపారు. అప్పుడు తొలగించిన 26 కులాలను మళ్లీ చేర్చాలని యత్నించడం సరికాదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, జిల్లా కార్యదర్శి చెన్నూరి రవి, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, నాయకులు మారపాక రమేశ్, గాండ్ల శ్రీనివాస్, గోపగాని నాగరాజు గౌడ్, సంకటి శ్రీనివాస్‌గౌడ్, కడారి సురేశ్ యాదవ్, కొలిపాక సుధాకర్, బండి విజయ, ముంజ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ పేరుతో మహాసభలు సరికాదు

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

నర్సంపేట : ఎంసీపీఐ(యూ) నుంచి వెలివేయబడిన మోర్తాల చందర్‌రావు ఎంసీపీఐ పేరుతో మహాసభల నిర్వహణ తలపెట్టడం సరికాదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశానికి రవి అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు తాము కృషి చేస్తుండగా మోర్తాల చందర్‌రావు స్వార్థ ప్రయోజనాల కోసం ఎంసీపీఐ పేరుతో మహాసభ నిర్వహిస్తున్నారని తెలిపారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ స్థాపించిన ఎంసీపీఐ, ఎంసీపీఐ(యూ)లను ఉపయోగించుకునే అర్హత చందర్‌రావు లాంటి వాళ్లకు లేదన్నారు. పార్టీ కమ్యూనిస్టుల ఐక్యత కోసం ఎంసీపీఐ నుంచి ఎంసీపీఐ(యూ)గా అవతరించి దేశవ్యాప్తంగా పని చేస్తోందని తెలిపారు. చందర్‌రావు లాంటి వ్యక్తులు ఎంసీపీఐ పేరుతో వరంగల్‌లో మహాసభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఎంసీపీఐ పేరుతో తలపెట్టిన మహాసభలను రద్దు చేసుకొని కలిసి రావాలని కోరారు. సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, నాయకులు కంచ వెంకన్న, నీల రవీందర్, కన్నం వెంకన్న, నర్ర ప్రతాప్, కుసుంబ బాబురావు, గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.